కులగణన సర్వేను మళ్లీ నిర్వహించాలి

- బీసీ సాధికారిత జిల్లా అధ్యక్షుడు నరేందర్

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్

వేములవాడ, ఫిబ్రవరి 10: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన తప్పుల తడకగా ఉందని, తిరిగి మళ్లీ సర్వే చేపట్టాలని బీసీ సాధికారత రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ డిమాండ్ చేశారు. సోమవారం వేములవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ కులగణన సర్వే పారదర్శకంగా జరగలేదన్నారు. పదేండ్ల కింద బీసీ జనాభా 51 శాతం ఉందని, ఇప్పుడు దానిని 46కు తగ్గించి చూపడంలో అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. దీనిపై మాట్లాడకుంటే భవిష్యత్‌లో రిజర్వేషన్లతోపాటు సంక్షేమ పథకాల్లో కోత పడుతుందని, బీసీలకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే కులగణన సర్వేను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పట్టణ అధ్యక్షులు తూపూకారి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ ఉన్నారు.

కేటీఆర్‌కు వివాహ ఆహ్వానం

వివాహ ఆహ్వాన పత్రికను స్వీకరిస్తున్న కేటీఆర్

గంభీరావుపేట, ఫిబ్రవరి 10: గోరంటాలకు చెందిన కొమిరిశెట్టి దేవేందర్ తన కూతురు వివాహ ఆహ్వాన పత్రికను సోమవారం హైదరాబాదులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అందజేశారు. 13న తన కూతురు సింధూజ వివాహానికి రావాల్సిందిగా ఆయన్ను కోరారు. అలాగే కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుకు ఆహ్వాన పత్రికను అందించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 10: వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆలయ అధికారులు, సిబ్బందిని ఈవో వినోద్‌రెడ్డి సూచించారు. సులభంగా దర్శనం చేసుకునేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు, లడ్డూ కౌంటర్, కల్యాణకట్టను పర్యవేక్షించి ఆలయ అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బందికి సూచనలు చేశారు.

మహా శివరాత్రికి విస్తృత ఏర్పాట్లు

- రాజన్న క్షేత్రంలో 25 నుంచి జరిగే జాతరను విజయవంతం చేయాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- జాతర ఏర్పాట్లపై ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సమీక్ష

మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, పక్కన ఎస్పీ అఖిల్ మహాజన్

కలెక్టరేట్, ఫిబ్రవరి 10: వేములవాడలో మహా శివరాత్రి జాతరకు విస్తృత ఏర్పాట్లు చేశామని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్, వేములవాడ రాజన్న ఆలయ ఈవో, ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలిసి జాతర సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు బస్సులు, పారిశుధ్యం, పార్కింగ్, రోడ్డు నిర్వహణ, దేవాలయం వద్ద వసతి సౌకర్యం, తాగునీటి సరఫరా, హెల్త్ క్యాంప్‌ల ఏర్పాటు, ఫైర్ ఇంజన్ సౌకర్యం, కల్యాణ కట్ట, ధర్మగుండం, బద్ది పోచమ్మ ఆలయం, హెల్ప్ సెంటర్, సీసీటీవీల ఏర్పాటు సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాల పై అధికారులు సిద్ధం చేసుకున్న ప్రణాళికను వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మహా శివరాత్రి జాతరను వైభవోపేతంగా నిర్వహించాలని ఆదేశించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్దేశిత పనులను జాతర సమయానికి సన్నద్ధమయ్యేలా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో ఫోన్ సిగ్నల్స్ సమస్య లేకుండా ఆపరేటర్లతో చర్చించి తాత్కాలిక టవర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. వేములవాడకు వివిధ డిపోల నుంచి మొత్తం 857 బస్సులు నడిపించనున్నట్లు తెలిపారు. పారిశుధ్యం లోపించకుండా 500 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ పేర్కొన్నారు. భక్తుల కోసం 3 లక్షల లడ్డూలు, ప్రసాదం సిద్ధంగా పెట్టామని, జాతర సందర్భంగా గుడి చెరువు ప్రాంతంలో భక్తులకు అల్పాహారం ఉచితంగా పంపిణీ చేస్తామని ఆలయ ఈవో వివరించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ గతం కంటే అధికంగా పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర సమయంలో తిప్పాపూర్ రస్తా దగ్గర సాయంత్రం మార్కెట్ నిర్వహించవద్దని సంబంధిత వ్యాపారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ శేషాద్రినీరెడ్డి, ఈవో వినోద్ రెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ సేద్యంపై దృష్టి సారించాలి

- రైతు శిక్షణలో విశ్రాంత ఏడీఏ రాజేశ్వర్

మాట్లాడుతున్న విశ్రాంత ఏడీఏ రాజేశ్వర్

చందుర్తి, ఫిబ్రవరి 10: రైతులు సేంద్రియ పద్ధతిలోనే పంటలు సాగు చేయాలని విశ్రాంత ఏడీఏ రాజేశ్వర్ సూచించారు. మండల కేంద్రంలో రైతు సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు చిలుక పెంటయ్య ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆయన హాజరై మాట్లాడారు. రైతులు రసాయనిక ఎరువులకు దూరంగా ఉండాలని, సేంద్రియ పద్ధతిలో పంటలు పండించి ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించాలని సూచించారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని ఏ పంట వేస్తే బాగుంటుందో తెలుసుకోవాలని సూచించారు. పంజాబ్, హర్యానా రాష్ట్రంలో అత్యధిక రసాయనిక ఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గిపోయిందని, పంటలు పండే పరిస్థితి లేదన్నారు. కాగా, చిలుక పెంటయ్య రైతు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విశ్వ అగ్రోటెక్ సీఈఓ సుభాష్ సేంద్రియ ఎరువుల వాడకం, పంటల దిగుబడులు, ప్రాజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, రామన్నపేట మాజీ సర్పంచ్ దుమ్ము అంజయ్య, రైతులు పాల్గొన్నారు.

ఐక్యతతో పోరాటం చేద్దాం

మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మాండ్లు

గంభీరావుపేట, ఫిబ్రవరి 10: ముదిరాజులను బీసీ డీ నుంచి ఏ గ్రూపుకు మార్చే వరకు ఐక్యంగా ఉంటూ ప్రభుత్వంపై సమిష్టిగా పోరాటం చేద్దామని ముదిరాజ్ మహాసభల రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్వ హన్మాండ్లు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘ భవనంలో ఏర్పాటు చేసుకున్న జిల్లా నూతన పాలకవర్గ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముదిరాజులు ఐక్యతతో ఉంటేనే ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతారన్నారు. అనంతరం జిల్లా ముదిరాజ్ నూతన పాలక వర్గానికి మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు చొక్కా రాము, మండల అధ్యక్షుడు లక్ష్మణ్, మత్స్య శాఖ సహకార సంఘ చైర్మన్ చొప్పరి రామచంద్రం, బీసీ స్టడీ సెంటర్ జిల్లా డైరెక్టర్ వెంకటస్వామి, మండల ప్రధాన కార్యదర్శి పిట్ల బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, దేవరాజు ఉన్నారు.

ఓటర్ ముసాయిదా జాబితా విడుదల

బోయినపల్లి మండల పరిషత్‌లో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీవో జయశీల, అధికారులు

వేములవాడ, ఫిబ్రవరి 10(బోయినపల్లి): మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీల వారీగా ఓటర్ ముసాయిదా జాబితాను విడుదల చేసినట్లు అసిస్టెంట్ జిల్లా ఎన్నికల అథారిటీ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బీమా జయశీల సోమవారం తెలిపారు. గత డిసెంబర్ 31 నాటికి నమోదైన ఓటర్ వివరాలతో జాబితాను మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాల గ్రామపంచాయతీల పరిధిలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఎంపీవో శ్రీధర్ ఉన్నారు.

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 10: తంగళ్లపల్లి మండల పరిషత్ ఎన్నికలకు సర్వం సిద్ధమవుతున్నది. ఈ మేరకు సోమవారం మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీల వారీగా ఓటర్ ముసాయిదా జాబితాను ఎంపీడీవో లక్ష్మీనారాయణ విడుదల చేశారు. మండలంలోని 30 గ్రామాల్లో 38,700 మంది ఓటర్లు ఉన్నట్లు మండల పరిషత్ కార్యాలయ నోటీస్ బోర్డుపై అతికించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేశ్, ఏంపీఓ, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇంట్లో నీళ్లు పడుతుండగా జారి పడి ఒకరి మృతి

అంజయ్య (ఫైల్)

కోనరావుపేట, ఫిబ్రవరి 10: ఇంట్లో జారిపడి తలకు తీవ్ర గాయాలై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కోనరావుపేట మండలం ధర్మారంలో సోమవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెలిశాల అంజయ్య (48) స్థానికంగా బార్బర్ షాప్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం ఇంట్లో నీళ్లు పడుతుండగా జారి కింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. అంజయ్యకు భార్య సుకన్య, కొడుకు శివ,కూతును సహస్ర ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మామిడిపల్లి సీతారామ ఆలయంలో నీటి తిప్పలు

కోనరావుపేట, ఫిబ్రవరి 10: వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన మామిడిపల్లి శ్రీసీతారామస్వామి ఆలయ ఆవరణలో భక్తులు నీటి కష్టాలు పడుతున్నారు. ఇటీవల మాఘ అమావాస్య జాతర సందర్భంగా అధికారులు ఆలయ ఆవరణలో వాటర్ ట్యాంకులకు నల్లాలు అమర్చి భక్తులకు ఇబ్బంది లేకుండా నీటిని సరఫరా చేశారు. అయితే జాతర ముగియగానే నల్లాలు అవసరం లేదంటూ వాటిని తొలగించి సీజ్ చేయడంతో నీటి సమస్య ఏర్పడింది. నిత్యం స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లకు సైతం సరఫరా లేక అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి తొలగించిన నల్లాలను తిరిగి బిగించాలని భక్తులు కోరుతున్నారు.

పాఠశాలలో వంట గదులు నిర్మించండి

వేములవాడ, ఫిబ్రవరి 10: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంట గదులు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ సిరిసిల్ల జిల్లా కమిటీ సభ్యులు కడారి శివ, సామల్ల సాయి భరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వేములవాడలో విలేకరులతో మాట్లాడారు. పాఠశాలల్లో వంట గదులు లేక నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వంట గదుల నిర్మాణానికి గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని, ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PASSPORT LOST

★ I Yelle Sai Sumanth S/o. Janardhan, H.No. 2-77/4, Sairam nagar Road, No. 6, Seetharampur, Kothapally Mandal, Karimnagar Dist. My Pass Port No. U7385331 Lost at Xerox Shop in Seetharampur Chowrastha any one Find Please Call Me : 8328249424
NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

- వివిధ సమస్యలపై 121 అర్జీల రాక
- స్వీకరించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కలెక్టరేట్, ఫిబ్రవరి 10: వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. 121 అర్జీలు సమర్పించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వీకరించారు. దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఇందులో రెవెన్యూ శాఖకు 50, సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి 12, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయానికి ఆరు, వ్యవసాయ శాఖ, ఉపాధి కల్పనా శాఖలకు 5 చొప్పున, జిల్లా పంచాయతీ కార్యాలయం, ఎంపీడీవో తంగళ్లపల్లి, ముస్తాబాద్, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయానికి నాలుగు చొప్పున, జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయానికి మూడు, వైద్య కళాశాల, డీఆర్డీవో, మిషన్ భగీరథ, ఎంపీడీవో కోనరావుపేట, సెస్ కార్యాలయానికి రెండు చొప్పున, ఏడీ మైన్స్, జిల్లా వైద్యాధికారి, డీపీఆర్ఈ, వేములవాడ రాజరాజేశ్వరాలయం ఈవో, నీటిపారుదల, ఎస్పీ కార్యాలయం, వేములవాడ మున్సిపల్ కార్యాలయం, ఎంపీడీవో గంభీరావుపేట, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట రిజిస్ట్రార్ కార్యాలయానికి ఒకటి చొప్పున వచ్చాయి. ఇక్కడ జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

బ్యాటరీ సైకిల్ ఇప్పించండి: దివ్యాంగుల వినతి

తనకు బ్యాటరీ సైకిల్ ఇప్పించాలని చందుర్తి మండలం కొత్తపల్లికి చెందిన దివ్యాంగురాలు పిట్టల రాజేశ్వరి ప్రజావాణిలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. నిరుపేద దివ్యాంగురాలినని, దయచూపాలని వేడుకున్నది. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన దివ్యాంగుడు నేరం నవీన్ తనకు స్కూటీ ఇప్పించాలని ప్రజవాణిలో వినతిపత్రం అందించాడు.

భూమిని పట్టా చేయాలని వృద్ధ దంపతుల వినతి

తమ కొడుకుల పేరిట పట్టా చేసిన వ్యవసాయ భూమి తిరిగి తమ పేరిట మార్చాలని తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు గొర్రె బాలమల్లు, ఎల్లవ్వ కోరారు. కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తమకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు సంతానమని చెప్పారు. తమ పేరిట 7 ఎకరాల 8 గుంటల భూమి ఉండగా పదేండ్ల కింద కొడుకులకు ఒక్కొక్కరికి మూడు ఎకరాల చొప్పున పంచి ఇచ్చినట్లు వివరించారు. మిగిలిన ఎకరం 8 గుంటలు తమ పేరిట ఉన్నట్లు పేర్కొన్నారు. తమ పోషణను కొడుకులు పట్టించుకోలేదని, గొడవలు జరిగాయని, గతంలోనే ఆర్డీవోను కలిసి ఫిర్యాదు చేస్తే తమకు నెలకు రూ.3 వేలు ఇవ్వాలని కొడుకులకు సూచించారన్నారు. తమ పేరిట ఉన్న ఎకరం 8 గుంటల భూమి కొడుకులే దున్నుకుంటున్నారని, నెల నెలా ఇవ్వాల్సిన రూ.3 వేలు ఇవ్వడం లేదన్నారు. కొడుకుల పేరిట తాము చేసిన 6 ఎకరాలను తిరిగి తమ పేరిట బదలాయించాలని కలెక్టర్‌కు అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

అంజన్నకు బంగారు తాపడం, వెండి తొడుగు బహూకరణ

అంజన్నకు బంగారు కిరీటం,వెండి తాపడం తీసుకువస్తున్న మహేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 10: కొండగట్టు ఆంజనేయ స్వామికి సోమవారం హైదరాబాద్‌లోని ఏఎంఆర్ ఇండియా చైర్మన్ మహేశ్వర్ రెడ్డి 325 గ్రాముల బంగారు తాపడం, గర్భాలయ ద్వారానికి కుడి, ఎడమ వైపు ద్వార బంధనం కోసం 48 కిలోల ఐదు గ్రాముల వెండి అందజేసినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. విలువ సుమారు రూ. కోటి ఉంటుందన్నారు. అలయ అర్చకులు బంగారు, వెండి వస్తువులను సంప్రోక్షణ నిర్వహించి స్వామి వారికి అలంకరించినట్లు చెప్పారు.

పూజారిపై దాడిని ఖండిస్తున్నాం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 10: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన పూజారి రంగరాజన్‌పై గుర్తుతెలియని వ్యక్తులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగ్గ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఇటీవల కొన్ని చోట్ల బ్రాహ్మణులపై దాడులు జరుగుతున్న తీరు బాధాకరమన్నారు. ధమ్ము, ధైర్యం ఉంటే అన్యాక్రాంతమైన భూములను తిరిగి రాబట్టేందుకు ప్రయత్నం చేయాలని, ఇలా బ్రాహ్మణులపై ప్రతాపాన్ని చూపడం సరికాదన్నారు. రంగరాజన్‌పై దాడిని ఖండిస్తూ, ఆయన వద్దకు వెళ్లి పరామర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

కోనరావుపేట, ఫిబ్రవరి 10: ధర్మారం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుష్ఠు వ్యాధిపై వైద్యాధికారులు అవగాహన కల్పించారు. వ్యాధి నివారణ దినోత్సవానికి సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. ఇక్కడ డీపీఎంవో దేవుసింగ్, మండల వైద్యాధికారి వేణుమాధవ్, ఎంఈవో మురళీనాయక్, ఎంఎల్‌హెచ్‌పీ చందు, ఏఎన్ఎం బుజ్జి ఉన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్ఠు వ్యాధి అనుమానితులకు అంగవైకల్యం ఉన్నవారికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

నిమ్మపల్లి ఆలయంలో చోరీ

కోనరావుపేట, ఫిబ్రవరి 10: నిమ్మపల్లిలోని హనుమాన్ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఉదయం వేళ ఆలయంలో అర్చకుడు పూజ సమయానికి రాగా, విగ్రహానికి ఉన్న వెండి కన్ను కనిపించలేదు. హుండీ ధ్వంసం చేసి ఉంది. వెంటనే గ్రామస్తులకు విషయాన్ని తెలియజేశారు. సమాచారం మేరకు పోలీసులు వచ్చి పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి అనిల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరి రిమాండ్

గంభీరావుపేట, ఫిబ్రవరి 10: కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై అక్రమంగా రైస్ తరలిస్తుండగా, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు తక్కువ ధరకు అందిస్తున్న బియ్యాన్ని దళారులు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంటల పరిశీలన

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 10: పొత్తూరు గ్రామంలో వరి, పొద్దుతిరుగుడు, మక్క పంటలను కరీంనగర్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ మధన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వరి పైరులో కాండం తొలుచు పురుగు సమస్యాత్మకంగా ఉందన్నారు. నివారణకు దీపపు ఎరలు, సోలార్ దీపపు ఎర, లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలని సూచించారు. నాటు వేసిన 15-20 రోజుల్లో ఎకరానికి కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 4జి 8కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3సీబీ 10 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 4 కిలోలు ఎకరాకు బురదలో చల్లుకున్నట్లైతే ఉపయోగం ఉంటుందన్నారు. మక్క పంటలో కత్తెర పురుగు నివారణకు క్లోరంత్రనిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఇక్కడ శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ ప్రసాద్, ఏఈవో లలిత ఉన్నారు.

పోషకాహారంపై అవగాహన

రుద్రంగి, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు, మహిళలకు పోషకాహారంపై వైద్య సిబ్బంది సోమవారం అవగాహన కల్పించారు. ఆరోగ్యలక్ష్మి సంపూర్ణ భోజన పథకం కింద అందిస్తున్న పోషకాహారం తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అర్చన, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 10: తనను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడం, ఠాణాలో ఫిర్యాదు చేసినా అరెస్ట్ చేయడం లేదనే మనస్తాపంతో ఎల్లారెడ్డిపేటలో ఓ మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన జకియా మెదక్ జిల్లా నారాయణపేట మండలం కాట్రియాల్‌కు చెందిన కోరె సంతోష్‌ను 2023 మార్చిలో ప్రేమ వివాహం చేసుకుంది. ఏడాది పాటు ఇద్దరు సంతోషంగా గడిపారు. కొంత కాలం నుంచి జకియాను సంతోష్ శారీరకంగా, మానసికంగా వేధిస్తుండగా, గత జనవరి 12న ఠాణాలో ఫిర్యాదు చేసింది. కేసు నమోదైనప్పటి నుంచి సంతోష్ అతని తల్లితో కలిసి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మరో ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. ఫిర్యాదు చేసినా పోలీసులు అతన్ని అరెస్ట్ చేయడం లేదనే మనస్తాపంతో జకియా సోమవారం ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆమెను చికిత్స కోసం మండల కేంద్రంలోని దవాఖానకు తరలించారు. ఈ విషయమై ఎస్ఐ రమాకాంత్‌ను వివరణ కోరగా, జకియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, నిబంధనల ప్రకారమే దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కాశీకి వెళ్లి.. మృత్యు ఒడికి

కోనరావుపేట, ఫిబ్రవరి 10: వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కదిరె శ్రీనివాస్ గౌడ్(46) కాశీలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు రోజుల క్రితం స్నేహితులతో కలిసి ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాకు వెళ్లాడు. అక్కడి నుంచి అయోధ్య రామమందిరానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుని, అదివారం కాశీకి వెళ్లారు. స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉండగా స్పృహతప్పి కింద పడ్డాడు. గమనించిన స్నేహితులు స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. శ్రీనివాస్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందినట్లు వైద్యులు పేర్కొనగా, స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శ్రీనివాస్‌కు భార్య మనీషా, కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా, మృతదేహాన్ని అంబులెన్స్‌లో కాశీ నుంచి తీసుకువస్తున్నారు.

ఆర్ఎంపీకి తీవ్ర గాయాలు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 10: నాంపెల్లి శివారులో రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ వైద్యుడు, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తిప్పాపూర్ బిడ్జి నుంచి నాంపెల్లికి వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో గాయాలు కాగా, స్థానికులు వేములవాడలోని ఓ దవాఖానకు తరలించారు.

నూకలమర్రిలో 'మీ కోసం'

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 10: నూకలమర్రిలో 'మీ కోసం' కార్యక్రమం నిర్వహించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామగ్రామాన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సమస్యలుంటే పరిష్కరించుకోవాలని సూచించారు. పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 10: నామాపూర్, మొర్రాపూర్, సేవాలాల్ తండాలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ మిట్టపల్లి శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఐదు లీటర్ల సారాతోపాటు 300 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేసి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో డీటీఎఫ్